www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 13 ఫిబ్రవరి 2025

5



300 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మండపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో బుధవారం శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు తెలిపారు. మండపేట, పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. కళాశాల అధ్యాపకుల సౌజన్యంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారనారు.ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ పి.వెంకన్న, లెక్చరర్లు డాక్టర్ కెఎస్ఆర్, డాక్టర్ నాయక్, శంకర్, గోపాల కష్ణ, డాక్టర్ మధు, రామ కృష్ణ అభినయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అరకొర వేతనాలే దిక్కు

- వెట్టి చాకిరీ చేస్తున్న ఆశాలు
- అందని కేంద్ర ప్రభుత్వ పారితోషికాలు
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆశ వర్కర్లపై నిరంతరం పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో వారు తరచూ అనారోగ్యాలకు గురవుతున్నారు. వేతనాలు పెరగకపోవడం, రాజకీయ వేధింపులు వంటి సమస్యలు ఆశ వర్కర్లకు ఎదురవుతున్నాయి. వీరి పరిధిలో జనాభా ఎక్కువగా ఉంటుంది. పని ఒత్తిడి పెంచడం వల్ల ప్రభుత్వం సెలవులు మంజూరు చేయడం లేదు. చాలీచాలని వేతనాలకు తోడు స్థానికంగా రాజకీయ వేధింపులు నడుమ తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3,200 మంది ఆశ కార్యకర్తలు పని చేస్తున్నారు. నిరంతరం ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం శ్రమిస్తున్నారు.

వైద్య సేవల్లో కీలక పాత్ర

ఆరోగ్య రంగంలో ప్రాథమిక స్థాయిలో వైద్య సేవలు నిర్వహించే ఆశాలు తీవ్రమైన పని భారం, ఒత్తిడితో అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు చూస్తూ మాతా, శిశు మరణాలు తగ్గించడంకోసం కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆశాలు వారి పరిధిలో 12 వారాల లోపు గర్భిణులను గుర్తించి నమోదు చేస్తున్నారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై నిర్దేశత సమయంలో పర్యటనలు చేస్తూ వారిని అప్రమత్తం చేస్తున్నారు. గర్భిణులను ప్రోత్సహించి ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరగడంలో వీరిదే కీలకపాత్ర. ప్రసవించిన తర్వాత బాలింతలకు జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలు, 42 రోజుల్లో ఏడుసార్లు దఫాలు విజిట్ చేసి వారికి శిశువుల పరిశుభ్రత భద్రతపై అవగాహన కల్పించడం, 45 రోజులు లోపు వేయవలసిన టీకాలు వేయించే పనులు చేస్తున్నారు. వివాహమైన జంట, పిల్లలు పుట్టకుండా ఎవరైనా ఉంటే వారి వివరాలను సర్వే చేస్తున్నారు. పిల్లల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. అయితే వీటితో బాటు అదనపు పనులతో తీవ్రస్థాయిలో సతమతమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆశలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిలిచిన పారితోషికాలు

ఇ-ఆశ యాప్‌లో 9 రకాల పనులను ఆశాలు చేసేలా జాబ్‌ఛార్ట్ ఉంది. కానీ ప్రభుత్వం వివిధ రకాల సర్వేలను చేయిస్తూ కనీసం పారితోషికాలు కూడా ఇవ్వడం లేదు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా పలు జాతీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆశాలకు గత రెండేళ్లుగా ఎటువంటి పారిపోషకాలు చెల్లించడం లేదు. రెండు రోజుల క్రితం నులిపురుగుల నివారణ కార్యక్రమానికి రోజుకు రూ.75 చొప్పున మూడు రోజులు పాటు ఇవ్వాల్సి ఉంది. అలాగే పల్స్ పోలియో కార్యక్రమానికి, ఫైలేరియా మాత్రల పంపిణీ కార్యక్రమానికి, 15 రోజులపాటు చేస్తున్న లెప్రసీ సర్వేకు పారితోషికాలు ఇవ్వాల్సి ఉంది. లెప్రసీ అవగాహన కార్యక్రమంలో భాగంగా సర్వే నిమిత్తం వర్కర్లకు ముందుగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం టిఎ, డిఎగా రూ.150 ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రెండేళ్లుగా జాతీయ కార్యక్రమాలకు ప్రభుత్వం ఆశలకు ఒక్క రూపాయి కూడా పారితోషం ఇవ్వడం లేదు. అలాగే టిబి మందుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 6 నెలలు మందులు వాడిన తర్వాత టిబి రోగికి క్లియరెన్స్ సర్టిఫికెట్ వస్తుంది. ఇందు నిమిత్తం రూ.1000 పారితోషకంగా ఆశాలకి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ 2014 నుంచి ఈ సొమ్ములు ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఇలా అదనపు పనులను చేయించుకుంటున్నప్పటికీ ఆశా వర్కర్లకు ఎటువంటి పారితోషకం అందకపోవడం శోచనీయమని పలువురు కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు.

పని ఒత్తిడితో ఇబ్బందులు



వివిధ సర్వేల పేరుతో నిరంతరం పని చేస్తున్న ఆశలపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు. లెప్రసీ, టిబి, మలేరియా, ఎన్‌సిబి, పిల్లాల ఇమ్యునైజేషన్ కోసం ఇంద్ర ధనస్సు వంటి సర్వేలు చేస్తున్నారు. అలాగే ప్రతి గురువారం ఆయా పాఠశాలల్లో ఐరన్ టాబ్లెట్లు కూడా వీళ్లే మింగించాల్సి వస్తుంది. ఎఎన్‌ఎంలు చేయాల్సిన పనులను ఆశలే చేయాల్సి వస్తుంది. అదనపు పనులు చేస్తున్న వారికి వెంటనే ప్రభుత్వం పారితోషికాలు చెల్లించాలి.

- చంద్రమళ్ల పద్మ, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆశా వర్కర్స్ యూనియన్

వెంటనే పారితోషికాలు ఇవ్వాలి



ఎన్‌హెచ్‌ఎం కార్యక్రమంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని జాతీయ సర్వేలు, వైద్య సేవల్లో పాల్గొంటున్నాం. కానీ మాకు ఎటువంటి పారితోషకాలు ఇవ్వడం లేదు. ఇప్పుడిస్తున్న రూ.10 వేలు వేతనంతోనే సరి పెట్టుకోమని చెబుతున్నారు. ఇది ఎంతవరకు సబబు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలి. అరకొర వేతనాలను మాత్రమే ఇస్తూ అదనపు పనులను ప్రభుత్వం మాతో చేయించుకుంటుంది.

- ఎం.లక్ష్మి, ఆశా వర్కర్, నాగులపల్లి పిహెచ్‌సి

పరిశ్రమలను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రభుత్వ సబ్సిడీతో ఏర్పాటు చేసి, నిర్వహిస్తున్న పరిశ్రములు అన్నింటిని ఆద్యంతం సక్రమంగా నడపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. మండలంలోని చొప్పెల్లలో ఏర్పాటు చేసిన కడియాపులంక క్వాయర్ క్లస్టర్ ఇండస్ట్రీకి సంబంధించి స్థితిగతులను కాకినాడ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ పికెవి.ప్రసాద్, ఇండస్ట్రీస్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.శివరాం ప్రసాద లతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. కోనసీమలో పీసు ఫ్యాక్టరీల పురోభివద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన క్వాయర్ క్లస్టర్ ఇండస్ట్రీ ఏర్పాటుకు రూ. 4.50 కోట్లు 90 శాతం సబ్సిడీతో మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ యూనిట్ వచ్చి దాదాపు రెండేళ్లు గడిచిన ఇంతవరకు పూర్తి స్థాయిలో ప్రోడక్ట్ రాకపోవడంపై నిర్వాహకులను ఆయన ప్రశ్నించారు. దీనిపై నిర్వాహకులు మాట్లాడుతూ టెక్నికల్ సమస్యతో పూర్తి స్థాయిలో యూనిట్ నడపలేకపోయామని, సమస్యలు అధిగమించి పూర్తి స్థాయిలో నడుపుతామని వారు తెలిపారు. అలాగే కోనసీమ జిల్లాలో మరిన్ని క్లస్టర్లు ఏర్పాటు చేసేందుకు తగినంత అనుభవం కోసం కేరళ రాష్ట్రానికి ఒక టీమ్‌ను పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. కొబ్బరి డొక్క అధికంగా దొరికే కోనసీమలో పలు పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా పలువురు యువతకు ఉద్యోగ భతి కల్పించినట్లు అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు, హార్టీకల్చర్ అధికారి కోటేశ్వరరావు, కోయిర్ బోర్డు ఆర్.రమేష్, పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకట రెడ్డి, విఆర్ఒలు, వివిధ శాఖల సిబ్బంది, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.


చొప్పెల్లలో క్వాయర్ క్లస్టర్ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

బర్డ్ ఫ్లూ నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కోళ్ల కు వైరస్ సోకడం ద్వారా వ్యాప్తి చెందుతున్న బర్డ్ ఫ్లూ నిర్మూలనకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ రవి వర్మ కోరారు. బర్డ్ ఫ్లూ విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నగర పంచాయతీ పరిధిలోని చికెన్ షాపులు, రెస్టారెంట్లు, భోజన హోటల్స్‌పై శానిటరీ సిబ్బందితో కలిసి కమీషనర్ రవివర్మ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాన్ని గుర్తించి, ఆ మాంసం ఆరోగ్యంగా ఉన్నాను సీజ్ చేశారు. అలాగే చికెన్ షాపుల వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న కోళ్లను, మాంసాన్ని స్వాధీనం చేసుకుని సుమారు 150 కేజీల మాంసాన్ని సీజ్ చేసి డంపింగ్ యార్డ్‌లో పూడ్చించారు. ఒక చికెన్ షాపు యజమాని ఫ్రిజ్‌లో నిల్వ చేసిన కుళ్లిపోయిన చికెన్ ను గుర్తించి, కుళినల మాంసాన్ని డంపింగ్ యార్డు కు తరలించారు. ఇకపై చికెన్ వ్యాపారులు రెండు వారాలు పాటు చికెన్ అమ్మకాలు నిలుపు చేయాలన్నారు. వినియోగదా రులు కొనుగోలు చేయకుండా సహకరించాలని నగర వాసులను కోరారు. అనంతరం పట్టణ పరిధిలోని 28 అంగన్ వాడీ సెంటర్లలోని పిల్లలకు కోడి గుడ్లు ఇవ్వ కుండా నిలుపు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో నగర పంచాయతీ ఎఇ పివి.సుధాకర్, హెల్త్ అసిస్టెంట్, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, నగర పంచాయతీ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.


చికెన్ షాపులో తనిఖీలు చేస్తున్న కమిషనర్

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

ఇటీవల వివిధ ఆసుపత్రుల యందు వైద్యం చేయించుకున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు బాధిత కుటుంబాలకు అందజేశారు. మండపేట పట్టానికి చెందిన ముసిని వీర్రాజుకు రూ.80వేలు, అనసూరి వెంకటలక్ష్మికి రూ.23,400, సింగంశెట్టి సత్యవంతరావుకు రూ.1,00,569, గోకరకొండ అమ్మాజీకి రూ.1,62,000, చింతా కిరణ్ కుమార్‌కి రూ.2లక్షలు, కొమ్ము వనజాక్షికి రూ.1,62,000, దేవరకొండ సత్య రాజేశ్వరికి రూ.23,920, మండపేట మండలం, ఏడిద గ్రామానికి చెందిన యర్రంశెట్టి నవ్యకు రూ.77,543, తాపేశ్వరం గ్రామానికి చెందిన నూని సునీల్ కుమార్‌కు రూ.1,46,766, ద్వారపూడి గ్రామానికి చెందిన తమ్మన కాళికృష్ణకు రూ.1లక్ష, కేశవరం గ్రామానికి చెందిన వల్లభని శ్రీనివాస్‌కు రూ.52,376, మంజూరయ్యాయి. ఈ సందర్భంగా వారంతా సిఎం చంద్రబాబు, ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వ రరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మండల టిడిపి అధ్యక్షులు యరగతపు బాబ్జి పలువురు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కామనగరువు ఆదిత్య పాఠశాలలో 36 వ రహదారి భద్రతా మాసోత్సవాలు2025పై అవగాహనా సదస్సు ప్రిన్సిపల్ రామ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు, అమలాపురం పట్టణ డిఎస్‌పి పిఎస్ఆర్‌కె. ప్రసాద్ పాల్గొని విద్యార్థిని, విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాల గురించి తెలియజేశారు. ఈ సందర్భం గా డిటిఒ మాట్లాడుతూ వాహనాన్ని నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. మైనర్లు వాహనాలను నడపరాదని ఒక వేళ నడిపినచో వారితోపాటు వారి తల్లిదండ్రులు కూడా శిక్షార్హులని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా విద్యార్థులందరి చేత రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కెఆర్. రవికుమార్ పిజె.సురేష్ బాబు, ఆదిత్య జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ చలపతి రావు, స్కూల్ ప్రిన్సిపల్ రామ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి

నెట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు మండలంలోని మర్లపాలెం గ్రామం విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.శ్రీకాంత్ బుధవారం తెలిపారు. నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రెటరీ పల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఈతకోట జడ్‌పి హైస్కూల్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలలో మెర్లపాలెం విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఆరుగురు విద్యార్థులు ఎంపిక అయ్యారని ఆయన పేర్కొన్నారు. యు-19 జూనియర్ బాయ్స్ విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న పెదగోపు బాలసురేష్ అనిల్ కుమార్, అత్తిలి హర్షవర్ధన వెంకటరమణ ,జూనియర్ గర్ల్స్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న చింతల అనూష, రంకిరెడ్డి కళ్యాణి రేవతి, బొలిశెట్టి ఇందు, 8వ తరగతి చదువుతున్న తోట మహాలక్ష్మి ఎంపిక అయ్యారని ఉపాధ్యాయుడు ఎస్.శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిర్ల శ్రీహరి, గ్రామ సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి, ఎస్ఎంసి ఛైర్మన్ పువ్వల లక్ష్మీనారాయణ నాగరాజు పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.



నెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు తదితరులు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఈదరపల్లి బొంతువారి పేట లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన 5 కుటుంబాలకు ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ బుధవారం పరామర్శించి రూ.25 వేలు విలువగల నిత్యావసర సరుకులను, బియ్యం, దుస్తులు అందజేశారు. అలాగే ఒక్కొక్క కుటుంబానికి రూ.2వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బత్తుల నకుల రాజు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ తరపున జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సేవలను వివరించారు. గతంలో జిల్లాలోని అనేక మండలాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వారిని ఆదుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈదరపల్లి గ్రామ పెద్దలు ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, జిల్లా ఉపాధ్యక్షులు నేరేడుమిల్లి సత్యనారాయణ, అమలాపురం మండల శాఖ అధ్యక్షులు బిఎస్సార్ ప్రసాద్, కోశాధికారి సాధనాల సత్యనారాయణ, మంగం సుధాకర్, అంబటి త్రిమూర్తులు, జనిపెళ్ల లోవరాజు, నూకపెయ్యి గంగాధర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


ఈదరపల్లిలో బాధిత కుటుంబాలకు సహాయం అందజేస్తున్న నాయకులు



కార్టూ'నిజం'

బర్డ్ ఫ్లూతో బెంబేలు

రుణాలు అందించేందుకు ప్రణాళిక

ప్రజాశక్తి - ఆలమూరు

చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ అర్హులైన చిరు వ్యాపారులకు రుణాలను అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసిందని ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎ.రాజు అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి కె.మోక్షాంజలి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో స్థానిక చిరు వ్యాపారులకు బుధవారం అవగాహన కల్పించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ (ఎంఎంఎస్‌ఎంఇ) ద్వారా అర్హులైన చిన్న తరహా పరిశ్రమ యజమానులకు రాయితీపై రూ.లక్ష నుంచి రూ పది లక్షల వరకూ రుణాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కె.సతీష్ మోహన్, సచివాలయ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.


ఎంఎంఎస్‌ఎంఇ పథకాన్ని వివరిస్తున్న ఎంపిడిఒ

పారిశుధ్య కార్మికునికి ఆర్థిక సాయం


ప్రజాశక్తి - ఆత్రేయపురం


మండల కేంద్రం ఆత్రేయపురానికి చెందిన పారిశుధ్య కార్మికుడు నాగయ్యకు గ్రామానికి చెందిన ముదునూరి సోమరాజు రూ.5 వేల సాయం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నాగయ్యను శాలువాలతో సత్కరించారు. అనంతరం పలువురు వక్తులు మాట్లాడుతూ ఆత్రేయపురం గ్రామానికి నాగయ్య పారిశుధ్య కార్మికునిగా చేస్తున్న సేవలు గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, . రిటైర్డ్ హెడ్మాస్టర్ మంతెన ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో మోడరన్ అధినేత జివి.రావు


సాకేత్ | వెంకటరాజు


సూర్య శ్రీనివాస్ | జితేంద్ర నాగసాయి | సాకేత వర్మ

ప్రజాశక్తి - యంత్రాంగం

జెఇఇ మెయిన్ తొలి విడత పేపర్-1 ఫలితాల్లో జిల్లాలో వివిధ కళాశాల విద్యార్థుల ప్రతిభ చాటారు ఈ సందర్భంగా పలువురు వారిని బుధవారం అభినందించారు.

రామచంద్రపురం: మంగళవారం ప్రకటించిన జెఇఇ ఎంట్రన్స్ పరీక్షల్లో మోడరన్ జిఆర్‌సి జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించి పట్టణంలో అగ్రగామిగా నిలవడంతో పాటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. దేగల శ్రీ అంజి 97.22, బల్ల జశ్వంత్ 93.07, డి.నీరజ 88.88, పి.భారతి 88.31, జివి.సాయిదుర్గా 86.36, జి.భవాని 86.26, పికెఎస్. ఉదయ్ 85.75, ఎ.వివేక్ సత్య సాయి 82.11 పర్సెంటైల్ సాధించారని మోడరన్ అధినేత లయన్ జీవి రావు తెలిపారు. వీరితో 70 పర్సంటైల్ పైన మరో నలుగురు విద్యార్థులు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో బుధవారం జరిగిన అభినందన సభలో విజేతలను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ఆత్మీయంగా సత్కరించారు.. అతి తక్కువ ఫీజులతో అత్యున్నత జాతీయస్థాయి ర్యాంకులు సాధిస్తున్న మోడరన్ విద్యార్థులు నియోజకవర్గ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. ఇటువంటి ఘనత సాధించిన మోడరన్ విద్యాసంస్థల అధినేత జివి.రావు అభినందనీయులని అన్నారు. ఈ సందర్భంగా లయన్ జి వి.రావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి విద్యార్థుల సమాహారమైన తమ మోడరన్ జూనియర్ కాలేజీలో ఇటువంటి అత్యుత్తమ స్థాయి పర్సంటైల్ సాధించడం ఆనందదాయకం అన్నారు. ప్రిన్సిపల్ సిహెచ్. రాజేష్ మాట్లాడుతూ.. 90 పర్సంటైల్ దాటి ఇద్దరు, 85 పర్సంటైల్ దాటి ఎనిమిది మంది,మొత్తం మీద 70 పర్సంటైల్ దాటి 14మంది సాధించి జెఇఇ అడ్వాన్స్‌కి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.ఏప్రిల్ నుంచి ప్రారంభం కాబోయే జెఈఈ రెండో సెషన్ కి ప్రణాళిక బద్ధంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అతి తక్కువ ఫీజులతో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్న ఒదుకు అభినందనలు తెలిపారు.

ఆలమూరు: జనవరి నెలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన జెఇఇ మెయిన్స్ ఎగ్జామ్ నందు మండల కేంద్రానికి చెందిన నెక్కంటి సతీష్ తనయుడు నెక్కంటి సాకేత్ 99.99 పర్సంటైల్ సాధించగా, మండలంలోని సంధిపూడి సర్పంచ్ తోట భవాని వెంకటేశ్వర్లు తనయుడు తోట మోహన్ నాగవీర వెంకటరాజు 99.77 పర్సంటైల్‌తోను జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించారు. దీంతో విద్యార్థులను మండల ప్రముఖులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

మామిడికుదురు: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం విడుదల చేసిన జెఇఇ మెయిన్ -2025 సెషన్-వన్ తాటిపాక ఎడ్యుకేర్ జూనియర్ కళాశాల ఐఐటి నీట్ అకాడమీ విద్యా సంస్థ విద్యార్థులు జిల్లా ఫస్ట్ టాపర్ గా నిలిచారు. జిల్లా ఓపెన్ కేటగిరిలో మొల్లేటి జశ్వంత్ సూర్య శ్రీనివాస్ 9.8 పర్సంటైల్స్ సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయిలో 13 లక్షల మంది పోటీ పడగా ఎడ్యుకేర్ విద్యా సంస్థ విద్యార్థి సూర్య శ్రీనివాస్ ప్రథమ స్థానంలో నిలిచారని, ఇనుమర్తి జితేంద్ర నాగ సాయి 94.5 పర్సంటైల్స్, చెక్క సాకేత వర్మ 93 పర్సంటైల్స్ సాధించారని కరస్పాండెంట్ కె.మరార్జీ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి జిల్లా ఫస్ట్ టాపర్ గా నిలవడంతో పాటు మరో ఇద్దరూ అత్యధిక పర్సంటైల్స్ సాధించడం విద్యా సంస్థకే కాకుండా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకే గర్వకారణమన్నారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన అధ్యాపకులను కరస్పాండెంట్ కె.మురార్జీ, డైరెక్టర్ కె.సత్యవాణి అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్టు

ప్రజాశక్తి - తుని

ఈనెల 10న తుని పట్టణం భాష్యం స్కూల్‌కు చెందిన విద్యార్థి పదమేశు కిడ్నాప్ కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి శ్రీహరిరాజు మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థి పదమేశును కిడ్నాపు పాల్పడిన నిందితులను ముగ్గురిని అరెస్టు చేశామని అన్నారు. భాష్యం స్కూల్లో పిఇటి ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మాతరాజులపుడు సహాయంతో రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన చంద్రాల కాశివుడు, సురకాసు రాముడు ఈ కిడ్నాపుకు పాల్పడ్డారని అన్నారు. వీరి నుంచి 3 సెల్‌ఫోన్లు, ఒక బైకు, ఒక కారును స్వాధీనం పరుచుకున్నామని అన్నారు. ఈ సమావేశంలో సిఐ ఎం.గీతారామకృష్ణ, ఎస్‌ఐ పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని బి.ప్రత్తిపాడులో అక్రమంగా నిల్వ చేసిన పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు బి.ప్రత్తిపాడు గ్రామంలో ఎ.గంగరాజు ఇంట్లో తనిఖీలు చేపట్టి సుమారు 3 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో రూరల్ ఎస్ఐ గుణశేఖర్, సివిల్ సప్లై అధికారులు అనిల్ కుమార్, నాగబాబు, విఆర్ఒ దాసు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షలకు తగిన ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని డిఆర్‌ఒ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షలతో పాటు ఎపి సార్వత్రిక విద్యాపీఠం 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు సంబంధించి మార్చి17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 142 పరీక్ష కేంద్రాల్లో 28,963 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ప్రశ్నాపత్రాలు స్టోరేజ్ నిమిత్తం 25 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 17 నుంచి 28 వరకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే 10వ తరగతి (ఓపెన్ ఎస్ఎస్‌సి) పరీక్షలు, మార్చి 3 నుంచి 15 వరకు ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. పరీక్షలు జిల్లాలో సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమని చర్యలు చేపట్టాలన్నారు. రెగ్యులర్ 10వ తరగతి పరీక్షలతో పాటు ఓపెన్ ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం పూట నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓపెన్ ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 8873 మంది విద్యార్థులకు 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న డిఆర్‌ఒ వెంకటరావు

స్టోరేజ్ కేంద్రాల నుంచి పరీక్ష పత్రాలను సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేర్చడం దగ్గర నుండి జవాబు పత్రాలను తిరిగి పోస్ట్ ఆఫీస్‌కు పంపే వరకు ప్రతి విషయంలోనూ వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్‌టిసి సర్వీసులు నడపాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. 144 సెక్షన్ అమలు, బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యల విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి జెవిఎస్.భాస్కరరావు, డిఇఒ పి.రమేష్, డిప్యూటీ జడ్‌పి సిఇఒ రామ్మోహన్, టిడిసి కె.శ్రీధర్, పోస్టల్ పిఆర్‌ఐపి కె.ప్రసాద్‌రావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వి.రాజశేఖర్, డిసిఇబి సెక్రటరీ ఎం.వెంకటరావు, ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి పి.సాయివెంకట రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న మునిస్వామి

కొత్త రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కొత్త పసుపు రేషన్ కార్డులను ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి బుధవారం అందజేశారు. పౌరసరఫరాల శాఖ అధికారి మెల్లం గౌతమ్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఐదు రోజులకొకసారి దసలవారీగా కార్డులను పంపిణీ చేస్తామన్నారు.

23న వేట కథలపై సదస్సు

ప్రజాశక్తి - యానాం

సాహిత్య అకాడమీ, యానాం స్ఫూర్తి సాహితీ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో వేట కథలపై ఈనెల 23న స్థానిక సర్వశిక్ష అభియాన్ సమావేశ మందిరంలో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు ప్రముఖకవి, కథకుడు, స్ఫూర్తి సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు తెలిపారు. ఈ సదస్సులో తనతో పాటు తెలుగు రచయితల సంఘం-సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మృణాళిని, సభ్యులు చింతకింది శ్రీనివాసరావు, యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొంటారని తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, జి.నీరజ అధ్యక్షతన జరిగే సదస్సులో పలువురు వక్తలు పాల్గొని వేట కథలపై ప్రసంగిస్తారని ఆయన తెలిపారు.

అసెంబ్లీ ఆవరణలో ఎంఎల్‌ఎల నిరసన

ప్రజాశక్తి - యానాం

నూతన మద్యం కర్మాగారాలకు ఏర్పాటుకు నిరసనగా బుధవారం బిజెపి ఎంఎల్‌ఎలు అసెంబ్లీ ఆవరణలో నిరసన తెలిపారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రజలు సాగు, తాగు నీరు అందక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కొత్తగా మద్యం కర్మాగారాలు ఏర్పాటు చేయడం ఏమిటని ఎంఎల్‌ఎలు ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర ప్రజా పోరాటం తప్పదని వారు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంఎల్ఎలు జాన్‌కుమార్, కళ్యాణసుందరం, రిచర్డ్ జాన్‌కుమార్, స్వతంత్ర ఎంఎల్ఎలు అంగళన్, శివశంకరన్, గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు.

జీవపరిణామాన్ని చాటిన డార్విన్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



డార్విన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ అడ్డాల

భూమిపై జీవజాలం ఏ విధంగా పరిణామం చెందిందనే అంశంపై పరిశోధన చేసి జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన గొప్ప ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ రాబర్ట్ డార్విన్ అని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో డార్విన్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లాండ్లో జన్మించిన ఆయన వైద్య విద్యను అభ్యసించారని అన్నారు. ప్రకృతిలో జీవ జాతులు తమ ఉమ్మడి పూర్వీకుల నుంచి క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడ్డాయని నిర్ధారించారని తెలిపారు. ఈ సిద్ధాంతం సర్వత్ర ఆమోదం పొందిందని వివరించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎస్‌పి కమాండెంట్‌కు అభినందనలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



కమాండెంట్‌ను సత్కరిస్తున్న అడబాల

ఎపిఎస్‌పి 3వ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ముద్రగడ నాగేంద్రరావును పలువురు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఎపిఎస్‌పి అదనపు కమాండెంట్‌గా సేవలందించినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ముఖ్య సెక్యూరిటీ అధికారిగా పని చేసిన ఆయన ఎపిఎస్‌పి 3వ బెటాలియన్ కమాండెంట్‌గా రావడం హర్షణీయమని అన్నారు. అభినందించిన వారిలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంతి జిఎం ఐ.ప్రసాద్‌నాయుడు, మాజీ సైనిక ఉద్యోగి శ్రీనగేష్, విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పెరవలి

మండలంలోనా పెరవలి 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతు పనులు నిమిత్తం పెరవలి, ముక్కామల, అజ్జరం, కాకరపర్రు, తీపర్రు, ఖండవల్లి, కొత్తపల్లి, నల్లాకులవారిపాలెం, కాపవరం గ్రామాల్లో గృహ, వాణిజ్య, పరిశ్రమ విద్యుత్ కనెక్షన్లకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు, ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు మల్లేశ్వరం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టలవేమవరం గ్రామాలకు, పెనుగొండ 33 కెవి పెరవలి విద్యుత్ లైన్ ట్రీ కటింగ్ నిమిత్తం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ 3 ఫేస్ విద్యుత్ ఉదయం 4 గంటల నుండి 7 గంటల వరకు మధ్యాహ్నం 1 గంట నుండి 6 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

పేరాబత్తుల కోసం కూటమి ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

ఎంఎల్‌సిగా పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలంటూ బుధవారం గోకవరంలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జగ్గంపేట నియోజకవర్గం ఎంఎల్‌సి ఎన్నికల అబ్జర్వర్, పెందుర్తి మాజీ ఎంఎల్‌ఎ గండి బాబ్జి పాల్గొన్నారు. టిడిపి మాజీ జడ్‌పిటిసి పాలూరి బోసిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బత్తుల సత్తిబాబు, గునిపే భరత్, పోసిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎఎస్‌పి పాటిల్‌దేవరాజ్ మనీష్

పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

సాధారణ తనిఖీల్లో భాగంగా ఎఎస్‌పి పాటిల్ దేవరాజ్ మనీష్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలపై ఎస్‌ఐ ఎన్.రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామకృష్ణతోపాటు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ పబ్లిక్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్ఇఒ వాసుదేవరావు

పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజమహేంద్రవరం అర్బన్‌లో గల ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు కార్యాలయానికి సమర్పించాల్సిన ముఖ్యమైన సమాచారాన్ని సమయానికి అందజేయకపోవడం విచారకరమన్నారు. సమ్మేటివ్ మార్కులు ఆన్‌లైన్, యు- డైస్ అప్‌డేషన్, అపార్ సంఖ్యలు నూరు శాతం పూర్తి చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అన్ని పాఠశాలల సమగ్ర సమాచారాన్ని మండల స్థాయిలో క్రోడీకరించి రాష్ట్ర స్థాయికి పంపాల్సి ఉందన్నారు. ఇది గమనంలో ఉంచుకుని సకాలంలో ఆ పనులను పూర్తి చేయాలన్నారు. ఇంతవరకు ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయడానికి కలెక్టర్ శనివారం వరకు మాత్రమే సమయాన్ని ఇచ్చారన్నారు. గడువు లోపల అన్ని పనులు నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్, డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.వీణాదేవి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో రీ సర్వే చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

రైతుల సమక్షంలో రీ సర్వే చేయాలని ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు ఆదేశించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాలకు చెందిన రెవెన్యూ, సర్వే, ఇతర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన భూముల రీసర్వేపై రైతులు పదేపదే అభ్యంతరాలు తెలపడంతో ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రీ సర్వే చేపడుతున్న సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమక్షంలో సర్వే చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత నెలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆయన ఆరా తీశారు. ఈ సమావేశంలో తహశీల్దార్ గోపాలకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మండా లక్ష్మి చిత్రపటం వద్ద కూటమి నాయకుల నివాళి

మృతురాలి కుటుంబానికి కూటమి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - అంబాజీపేట

అమలాపురం స్థానిక కొంకాపల్లి కి చెందిన మండ లక్ష్మి ఆకాల మరణానికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులను బుధవారం అంబాజీపేట కూటమి నాయకులు పరామర్శించారు. మృతి చెందిన మండా లక్ష్మి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటెశ్వరరావు అత్తయ్య. పలువురు శిరిగినీడి వెంకటేశ్వరరావును పరామర్శించిన వారిలో మాచవరం గ్రామ సర్పంచ్ నాగాబత్తుల శాంతాకుమారి వెంకటసుబ్బారావు, మండల జనసేన అధ్యక్షులు దొమ్మేటి సాయికృష్ణ, యర్రంశెట్టి నాగేంద్ర, జనసేన పార్టీ ప్రోగ్రాం కమిటీ సభ్యులు ములపర్తి రమేష్, మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి బులిస్వామి, కమిటీ కార్యదర్శి, ఉన్నారు.

13న సామూహిక ఎలుకల నిర్మూలన

ప్రజాశక్తి - మామిడికుదురు

మండల పరిధిలో రైతు సేవ కేంద్రాల వద్ద ఈనెల 13 గురువారం 9 గంటలకు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తారని మండల వ్యవసాయాధికారిణి బి.మృదుల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం దుర్గా దేవి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, మహా చండీ హోమం ఘనంగా నిర్వహించారు. దుర్గా పీఠాధిపతి భాస్కర స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమపూజ, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు వేద మంత్రోచ్ఛరణ నడుమ నిర్వహించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి గరగ నృత్యాలతో అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం దుర్గ దేవి ఆలయం వద్ద ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భాస్కర స్వామీజీ తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

వ్యవసాయ సేవల సులభతరానికి చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఈ నెల 23 వరకు భూమి గల ప్రతీ రైతుకు 11 డిజిట్స్ గల ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.లక్ష్మీ లావణ్య అన్నారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఇది వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బహత్తర కార్యక్రమం అన్నారు. రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియలో ముఖ్యాంశాలు తెలుపుతూ రైతు గుర్తింపు సంఖ్య రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అన్నారు. దీంతో రైతుకు చేకూరే ప్రయోజనాలు అర్హులైన భూమిగల రైతులు గుర్తించడంలో తోడ్పడి, వారికి ప్రభుత్వం నుంచి వచ్చు వివిధ సబ్సిడీలు, పథకాలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందన్నారు. అలాగే భూ ఆధారిత పథకాలైన పిఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుందన్నారు. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి తోడ్పడుతుందన్నారు. గ్రామంలో గల రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, రైతు గుర్తింపు సంఖ్య పొందవచ్చు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకు, మున్ముందు కౌలు రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తుల్లో ఉన్న వారికి ఇది వర్తిస్తుం దన్నారు. నమోదు కొరకు ఆధార్ నెంబర్, ఆధార్ అనుసంధారిక ఫోన్ నెంబర్, 1బి జిరాక్స్ తీసుకొని గ్రామంలో రైతుసేవా సిబ్బందిని కలిసి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలన్నారు.



బహూకరించిన వారికి అభినందనలు తెలుపుతున్న సర్పంచ్ తదితరులు

సౌండ్ బాక్స్, రూ.10 వేల నగదు బహూకరణ

ప్రజాశక్తి - అంబాజీపేట

ఇసుకపూడి హైస్కూల్ కు భమిడి జగన్నాథం జ్ఞాపకార్థం వారి కుమారుడు భరద్వాజ్ రూ.15 వేలు విలువ చేసే అహూజా సౌండ్ బాక్స్, రిటైర్డ్ ఉపాధ్యాయులు అయ్యగారి శ్రీనివాస్ పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు విలువ చేసే బాక్సులు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని సర్పంచ్ తరపట్ల మోహన్ సింగ్ బాబురావు, ఎంపిటిసి సమాఖ్య మండల అధ్యక్షులు ముత్తాబత్తుల ప్రశాంత్, పళ్ల శ్రీను, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

స్కూల్ గ్రౌండ్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కొన్నేళ్లగా ఉన్న స్కూల్ గ్రౌండ్ సమస్యను బండారు సంజీవ్ పరిష్కరించారు. మండలంలోని ర్యాలీ గ్రామం రామకష్ణ జిల్లా పరిషత్ హై స్కూల్ మైదానం అధ్వానంగా తయారై విద్యార్థులు ఆటలు ఆడేందుకు ఉండేది కాదు. ఈ సమస్యను గత ఐదేళ్ల నుంచి విద్యార్థులు ఎదుర్కొంటు న్నారు. ఎన్నిసార్లు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకోక పోవడంతో నియోజకవర్గ ఎంఎల్ఎ సత్యానందరావు తనయుడు సంజీవ్ దష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా స్పందించిన ఆయన స్కూల్ మైదానాన్ని విద్యార్థులు ఆటలాడుకునేలా చదును చేయించారు. దీంతో హైస్కూల్ విద్యార్థులు సంజీవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సతీష్ రావు

హసన్‌బాదలో పారిశుధ్య పనుల నిర్వహణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని హసన్ బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో శానిటేషన్ పనులను చేపట్టారు. అందులో భాగంగా డ్రెయినేజీలలో పేరుకుపోయిన చెత్త,మట్టి పూడికలను తీయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు మాట్లాడుతూ డ్రెయినేజీలో వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లు , కొబ్బరి బొండాలు వంటివి వేయొద్దన్నారు. వీటివల్ల వర్షాకాలంలో డ్రెయినేజీల్లో మురుగునీరు ఎక్కడికి అక్కడ నిలిచిపోతుందని వివరించారు. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సర్పంచ్ సూచించారు.

ఘనంగా సాయి వీరభద్ర స్వామి సంబరం

ప్రజాశక్తి - మామిడికుదురు



యాత్రికులతో ఆకట్టుకున్న సూలాలతో వీరనాట్యం

అప్పనపల్లిలో తులా గోపాలకృష్ణ నాగ సూర్యావతి దంపతులు ఆధ్వర్యంలో బుధవారం సాయి వీరభద్ర స్వామి సంబరం ఘనంగా నిర్వహించారు. పల్లకిలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. యాత్రికుల సూలాలతో వీరనాట్యం చేస్తూ వైనతేయ గోదావరి వరకు ఊరేగింపుగా వెళ్లారు. గోదావరిలో స్నానమాచరించి శమీ పూజ నిర్వహించారు. వైసిపి సీనియర్ నాయకులు డిఎంఆర్.శేఖర్, నల్ల అజయ్, డాక్టర్ గంధం సాయి విశ్వనాథ్ తదితరులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

దంగేరు పిహెచ్‌సిలో స్పర్శ కార్యక్రమం

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని దంగేరు ఆరోగ్య కేంద్రంలో స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఆమని ఆధ్వర్యంలో లో జిల్లా డిప్యూటీ పేరా మెడికల్ ఆఫీసర్ మాధవరపు వెంకటేశ్వర్లు పాల్గొని ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆశా కార్యకర్తలంతా ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించి అంగవైకల్యం రాకుండా చూడాలని కోరారు. అదే విధంగా గత నెల 20 నుంచి ప్రారంభమైన ఎలిసిడిసి కార్యక్రమం ఈనెల 13వ తేదీ వరకు పొడిగించాము అన్నారు. జిల్లాలో ఇంతవరకు ఎలిసిడిసి సర్వేలో 14 కొత్త కేసులను గుర్తించి చికిత్స అందించారని, గత ఏప్రిల్ నుంచి జనవరి నెల వరకు 77 కొత్త కేసులను గుర్తించి చికిత్స చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 8 మంది వ్యాధిగ్రస్తులకు మైక్రో సెల్యులర్ రబ్బర్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన పాదరక్షలు, అల్సర్ కిట్లు డాక్టర్ ఆమనిచే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఒ పద్మ మహేష్ బాబు, నోడల్ పెర్సన్ శ్రీమన్నారాయణ, జిల్లా నోడల్ ఆఫీసర్ సిహెచ్.సూర్యారావు, ఎఎన్ఎం లు, ఆశాలు పాల్గొన్నారు.



వ్యాధిగ్రస్తులకు పాదరక్షల కిట్ల పంపిణీ



ఎయిర్ వెల్ పాడైపోవడంతో వృథాగా పోతున్న శుద్ధి చేసిన జలాలు

వృథాగా పోతున్న గోదావరి శుద్ధ జలాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని 17 గ్రామ ప్రజలకు గోదావరి నీటిని శుద్ధి చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న లక్ష్యం సంవత్సరాలు గడుస్తున్నా నెరవేరడం లేదు. పైప్‌లైన్లు నాసిరకం వేయడంతో తరచూ అవి పగిలి శుద్ధి జలాలు కలుషితం అయ్యి తాగునీరు వృథాగా పోతోంది. దీంతో రూ.లక్షలు ఖర్చు చేసి శుద్ధి చేస్తున్న జలాలు మట్టిపలవుతున్నాయి. దీంతో గోదావరి జలాలు మండలంలోని గ్రామాల ప్రజలకు అందని ద్రాక్ష గానే మిగిలింది. బొబ్బర్లంక వద్ద, ఉచిలి వద్ద రూ.13 కోట్లతో నిర్మించిన. ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా గోదావరి జలాలను శుద్ధిచేసి వాటిలో నింపి అనంతరం గ్రామాలలోని ఏర్పాటు చేసిన కుళాయిల ద్వారా అందిస్తున్నారు. అయితే శుద్ధి జలాలు పైప్ లైన్ల ద్వారా సక్రమంగా ముందుకు వెళ్లేందుకు ఎయిర్ వెల్‌లు ఏర్పాటు చేశారు ఇవి కాస్త తుప్పు పట్టి పాడైపోవడంతో గోదావరి జలాలు వృథాగా పోతున్న అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం మనిషికి సగటున 40 లీటర్ల నీటిని అందిస్తున్నామంటూ చెబుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రయివేటు ప్లాంట్లలో తాగునీటిని డబ్బులు ఇచ్చి కొనుక్కుని తాగే పరిస్థితి నెలకొంది. పేరవరం కళ్యాణ మండపం సమీపంలో ఆర్‌అండ్‌బి రోడ్డు చెంతని ఉన్న ఎయిర్ వెల్ తుప్పు పట్టి పాడైపోయి గోదావరి జలాలు సుమారు రెండు నెలల నుంచి వృథాగా పోతున్న అధికారులు గాని ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అసహన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని మండలంలోని గ్రామాల ప్రాంత ప్రజలకు తాగునీరు వృథా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.